సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 15 । మార్చి । 2025



దోస రైతుకు నిరాశ

లక్ష రూపాయలు భూమిలో పోసిన రైతుకు ఏటా నిరాశే మిగులుతోంది. దోస పంటకు డిమాండ్ ఉంటుందని పండించిన రైతులు దళారుల మాయకు దిగాలు పడుతున్నారు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని॥ (సా॥)	సహర్ ఆది॥ (ఉ॥)
రాయచోటి	6.30	5.03
రాజంపేట	6.28	5.09
పీలేరు	6.29	5.00
మదనపల్లె	6.31	5.03

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 112 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు జిల్లాకు ప్రత్యేకాధికారి వినయ్ చంద్

రాయచోటి: ప్రభుత్వం జిల్లాకు నియమించిన ప్రత్యేక అధికారి వాడరేవు వినయ్ చంద్ శనివారం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం రాయచోటిలోని డైట్ ఉన్నత పాఠశాల, మున్సిపల్ కార్యాలయం, గవర్నమెంట్ జూనియర్ కళాశాల, కాటిమాయకుంట తదితర ప్రాంతాల్లో జరగనున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శిగా కరీముల్లా

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా, మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఎస్‌ఏ కరీముల్లాను రాష్ట్ర మైనార్టీ విభాగ కార్యదర్శిగా నియమించారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

నూతన కార్యవర్గం

కడప సెవెన్‌రోడ్స్: ఏపీ శారీరక వికలాంగుల ఉద్యోగ సంక్షేమ సంఘానికి కొత్త కార్యవర్గ ఎన్నిక శుక్రవారం కడప నగరంలోని విద్యుత్ విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా బి.సుధాకర్, అధ్యక్షుడిగా పులిమి జేమ్స్, ప్రధాన కార్యదర్శిగా చిన్నకొట్టి చంద్ర, ట్రెజరర్‌గా బత్తుల చంద్రశేఖర్, సమాచార కార్యదర్శిగా పి.సుబ్బరాజు, కార్యదర్శులుగా వై.గురప్ప, హెచ్.నరసింహులు, కన్వీనర్‌గా ఎం.రవిశంకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

21న మెగా జాబ్‌మేళా

రాయచోటి జగదాంబసెంటర్: ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్‌ఎస్‌డీసీ), సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే ఉద్యోగ మేళాలో టెక్‌మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండిగో ఎయిర్‌లైన్స్, అడక్కో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఆధ్య హెచ్‌ఆర్ సొల్యూషన్స్, నియో లింక్, ముత్తూట్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్, బిగ్ సీ, ఫోన్ పే ఫ్లిప్‌కార్ట్, అపోలో ఫార్మసీ తదితర కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9550104260, 9618971075 నంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ వివరించారు.

మహిళల భద్రతకు 'శక్తి యాప్'

రాయచోటి: మహిళలు, బాలికల భద్రత కోసం శక్తియాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో యాప్ వినియోగం గురించి ఎస్పీ వివరించారు. జిల్లాలో ప్రతి మహిళ, గృహిణులు, విద్యార్థినులు, బాలికలు వారి మొబైల్‌లో శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆపద సమయంలో పోలీసుల నుంచి తక్షణ సహాయ సహకారాలు పొందాలన్నారు. ఆపదలో ఉన్న మహిళలు ఎవరైనా ఎస్‌ఓఎస్ బటన్ ప్రెస్ చేస్తే వారు ఉన్న ప్రాంతం వివరాలు దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు డయల్ 112 నంబర్‌కు చేరుతుందని, వెంటనే పోలీసులు అప్రమత్తమై సంఘటనా స్థలానికి చేరుకొని వారికి రక్షణ కల్పించే విధంగా చర్యలు చేపడతారని ఎస్పీ వివరించారు.

శాస్త్రోక్తంగా చక్రస్నానం



స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదోరోజైన శుక్రవారం ఉదయం తోమాల సేవ, తిరుచ్చి ఉత్సవం, ఊంజల్‌సేవలు జరిగాయి.అర్చకులు రంగునీళ్లు, పసుపునీళ్లు ఒకరిపై ఒకరు చల్లుకొంటూ కోలాహలంగా వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం స్నపన తిరుమంజనం జరిపించారు. స్వామివారి ఆయుధాలైన శంఖు,చక్రాలను పవిత్ర జలాలతో శుద్ధి చేస్తూ చక్రస్నాన మహోత్సవం నిర్వహించారు. రంగురంగుల పుష్పాలతో అలంకరించిన తిరుచ్చి వాహనంలో స్వామివారిని కొలువుదీర్చి గ్రామపురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అర్చకులు ధ్వజావరోహణ కార్యక్రమం జరిపారు. ఏకాంత సేవతో ఈరోజు ఉత్సవాలు ముగిశాయి. పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకొని స్వామివారికి పూజలు నిర్వహించారుకార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

మేలుకొందాం

తక్కువ తూకం..నాణ్యత లోపం..గడువుకు ముందే దెబ్బతినడం.. నిర్లక్ష్య సమాధానం.. బాధ్యతారాహిత్యం.. నిత్యావసర వస్తువుల మొదలు అత్యాధునిక ఎలక్ట్రానిక్ పరికరాల వరకు ముందు..వెనుక దగా..తాగే నీళ్లు, పాలలో కూడా నాణ్యత లేకుండా పోయింది. తూకాల్లో భారీగా తేడాలు ఉన్నాయి. చివరకు నష్టపోయేది వినియోగదారుడే. వీటిపై ఎవరైనా ప్రశ్నిస్తే తప్ప న్యాయం జరగడం లేదు. ఈ తరహా మోసాలను అరికట్టాలంటే వినియోగదారులు మేలుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.కొనుగోలుదారుడికి రక్షణగా చట్టం ఉంది.మనం చేయాల్సింది వినియోగించుకుని మేలుకోవడమే. నేడు (మార్చి 15) ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

- నిలువు దోపిడీ చేస్తున్న వ్యాపారులు
- అధిక ధరకు అమ్మకాలు
- నాణ్యతా, ప్రమాణాలు పాటించని వైనం
- నష్టపోతున్న వినియోగదారులు
- ఫిర్యాదులుంటేనే చర్యలంటున్న అధికారులు





రాయచోటి: జిల్లా కేంద్రం రాయచోటిలోని వీధుల్లో తిరుగుతున్న బండిపై ఓ మహిళ వంద రూపాయలకు 4 కిలోల ఉల్లిపాయలు కొనుగోలు చేసింది. వ్యాపారి ఎలక్ట్రానిక్ యంత్రంపై తూకం వేసి ఇచ్చాడు. అనుమానం రావడంతో పక్కనే ఉన్న దుకాణంలో నాలుగు కిలోల ఉల్లిగడ్డలను తూకం వేసి పరీక్షించింది. 600 గ్రాములు తక్కువగా ఉన్నట్లు గుర్తించింది. జిల్లా కేంద్రంలో ఇలా ప్రతి రోజు వినియోగదారులు వ్యాపార కేంద్రాలలో ఏదో విధంగా మోసాలకు గురవుతూ వస్తున్నారు. ఆటో, తోపుడు బండిలలోనే కాకుండా చిల్లర దుకాణాలు, చౌకదుకాణాలు, ఫర్టిలైజర్స్ షాపులు, కూల్‌డ్రింక్స్, మందులు, మాత్రలు, సంతలలో ఇలాంటి మోసాలు అధికంగా కనిపిస్తున్నాయి.


అధిక ప్రాధాన్యత

కస్టమర్లకు వ్యాపార సంస్థలు సైతం ఎక్కువ ప్రాధాన్యతను అందిస్తాయి. మార్కెట్లో వినియోగదారులు సరసమైన ధరలతో పాటు స్వచ్ఛమైన, నాణ్యమైన ఉత్పత్తులను కోరుకుంటుంటారు. వారి ప్రయోజనాలను పరిరక్షించేందుకు వినియోగదారుల చట్టం ఉంది.ఇందులో ప్రాథమిక హక్కులను కల్పించింది.

సమాచార హక్కు

ఏదైనా ఉత్పత్తి గురించి కావాల్సిన సమాచారాన్ని తెలుసుకునే హక్కు వినియోగదారులకు చట్టం కల్పించింది. ఉదాహరణకు ప్రొడక్ట్ నాణ్యత, పరిమాణం, ధర, క్వాలిటీ, ఎక్స్‌పైరీ తేదీ వంటి వివరాలను అడిగి తెలుసుకోవచ్చు. వినియోగదారుల చట్టం ప్రకారం.. కస్టమర్లు తన అభిప్రాయాన్ని వ్యక్తీకరించే హక్కును కలిగి ఉంటారు. కస్టమర్ కొనుగోలు చేసిన ఉత్పత్తిపై ఏదైనా లోపం ఉంటే అభ్యంతరం తెలియజేయవచ్చు. కస్టమర్ తాము మోసపోయామని భావిస్తే.. వారు వినియోగదారుల ఫోరమ్‌లో సదరు వ్యాపార సంస్థ లేదా కంపెనీపై ఫిర్యాదు చేయవచ్చు.





ఫిర్యాదుల పరిష్కారం

తమకు మోసం జరిగితే అది ఉత్పత్తి ప్రొఫెషనల్ లేదా కంపెనీకి సంబంధించిన ఫిర్యాదైనా వినియోగదారు చట్టం ప్రకారం ఫిర్యాదు చేయవచ్చు. వినియోగదారుల ఫోరం లేదా వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార కేంద్రం దీనిని పరిష్కరిస్తుంది.

సిబ్బంది కొరత

జిల్లాలో తూనికలు, కొలతల శాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. జిల్లా అధికారితో పాటు, టెక్నికల్ అసిస్టెంట్, అటెండర్ మరో కానిస్టేబుల్ అవసరం ఉంది. ఇప్పటి వరకు వారిని నియమించకపోవడంతో తగిన రీతిలో దాడులు చేయలేకపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

అందుబాటులో హెల్ప్‌లైన్

వినియోగదారుడికి హక్కులపై అవగాహన కల్పించి మోసపోకుండా ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా వినియోగదారుల మేళాలు, శిబిరాలు, వర్క్‌షాప్‌లను కూడా నిర్వహిస్తోంది. వినియోగదారుల హక్కుల కోసం దేశంలో హెల్ప్‌లైన్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. కస్టమర్లు తన ఫిర్యాదును నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్ 1800114000 టోల్‌ఫ్రీ నంబర్‌లో నమోదు చేయవచ్చు.



ప్లాస్టిక్ తట్ట లేక ముందు ఎలక్ట్రానిక్ యంత్రంలో చూపిస్తున్న తూకం



పాత తరం నాటి తక్కెడ (తూకం యంత్రం) వాడుతున్న పండ్ల వ్యాపారి

భద్రత హక్కు

సేఫ్ షాపింగ్ అనేది వినియోగదారుడి ఉన్న ప్రధాన హక్కు. కొనుగోలు చేసిన ఉత్పత్తి భద్రతకు తయారీదారు బాధ్యత వహించాలి. మార్కెట్లో సెల్లర్స్ ఎల్లప్పుడూ నాణ్యమైన వస్తువులను విక్రయించాలి. వినియోగదారులు కూడా నాణ్యమైన ఉత్పత్తులను కొనుగోలు చేయాలి. ఐఎస్ఐ మార్క్, ఐఎస్ఓ సర్టిఫైడ్ ఉత్పత్తులను ఉపయోగించాలి. వస్తువుల నాణ్యత, దానితో పాటు సేవల గురించి సమాచారాన్ని పొందే హక్కు వినియోగదారులకు చట్టం కల్పించింది. ఏ కంపెనీకి చెందిన ఉత్పత్తిని కొనుగోలు చేయాలనే హక్కును కస్టమర్లకు చట్టం కల్పించింది. షాపింగ్ సమయంలో కస్టమర్ల నిర్ణయానికి విరుద్ధంగా వేరే బ్రాండ్ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని వ్యాపారి బలవంతం చేసినట్లయితే వినియోగదారులు దీనిపై ఫిర్యాదు చేసేందుకు చట్టం వెసులుబాటు కల్పించింది.

236 కేసులు నమోదు.. రూ.16.19 లక్షల రికవరీ



మార్చి 1వ తేదీ వరకు 236 కేసులు నమోదు చేసి 16.19 లక్షల రూపాయలను అపరాధ రుసుం ద్వారా వసూలు చేశాం. తూనికలు కొలతల జిల్లా ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. అలాగే ఏడాది కాటాలకు ముద్రణ ద్వారా 17.19 లక్షల రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. తూకాలు, ధరలు, తేదీలు కొనుగోలు వస్తువుపైన రశీదు పొందే విషయాలపై వినియోగదారులు చాలా జాగ్రత్తగా ఉండాలి. చౌకదుకాణాలు, తోపుడుబండ్లు, బస్టాండు, చిల్లర దుకాణాలు, కూల్‌డ్రింక్ షాపులు, ఫర్టిలైజర్ షాపులు, చికెన్ సెంటర్లలో ప్రజలు ఎక్కువగా మోసపోతుంటారు. ఎక్కడైనా ఎవరికైనా కొనుగోలు అన్యాయం జరిగిందని తెలిసిన వెంటనే 9885217776కు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే వెంటనే ఆ షాపుల, కేంద్రాలపైన దాడులు చేసి చర్యలు తీసుకుంటాం. వేయింగ్ మిషన్లలో జీరో చూసిన తర్వాతనే తూనికలు, కొలతతు వేయించుకోవాలి.

– ఎం.నాగరాజు, తూనికలు కొలతల ఇన్‌స్పెక్టర్, అన్నమయ్య జిల్లా

తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి



కొనే ప్రతి వస్తువులోనూ లోపం లేకుండా సరైన ధర, తూకం, నాణ్యత పొందడానికి వినియోగదారులు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలి. గుండు సూది నుంచి విమాన ప్రయాణం వరకు కొనే వారు, ఖర్చు చేసే వారంతా వినియోగదారులే. మనం తాగే పాలు, నీరు, కొనుగోలు చేసే ప్రతి వస్తువు నాణ్యతపై ప్రశ్నించే తత్వాన్ని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలి. వినియోగదారుడు ఎలాంటి కొనుగోళ్లు చేసినా తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి. కొనుగోలు చేసిన వస్తువుల్లో లోపాలు ఉంటే వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేసి రక్షణ పొందవచ్చు. –మేకల దర్బార్‌బాషా, జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు

తూకాల్లో మోసాన్ని పసిగట్టలేకపోతున్నాం



తూకాల్లో వ్యాపారులు చేసే మోసాలను పసిగట్టలేకపోతున్నాం. తూనికల కొలతల అధికారుల పర్యవేక్షణ లోపంతో వ్యాపారులు ఇష్టానుసారంగా మోసాలు చేస్తూ దండుకుంటున్నారు. నాణ్యతలేని సరుకులను అందజేస్తున్నారు. ఎలక్ట్రానిక్‌తోపాటు మామూలు కాటా తూకాల్లో కూడా వినియోగదారులను నట్టేట ముంచే విధంగా వ్యాపారు. వ్యవహరిస్తున్నారు. దీనిపై జిల్లా అధికారులు దృష్టి సారించాలి. మోసాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. –గంగిరెడ్డి, వినియోగదారుడు, కోనంపేట, లక్కిరెడ్డిపల్లి మండలం

అందరూ ఒకే ధరతో అమ్మడం లేదు



మార్కెట్లో విక్రయిస్తున్న కూరగాయల ధరల్లో తేడాలు ఉన్నాయి. ఒకే ధరకు ఎవరూ కూడా అమ్మడం లేదు. ఏదైనా ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా దాట వేస్తున్నారు. ఇక్కడ రైతులు మాత్రమే కూరగాయలు అమ్ముకోవాలి. రైతులు ఎవరూ కూడా లేరు. –సుబ్బరాయుడు, సంబేపల్లె

పర్యవేక్షణ కొరవడింది



నేను చాలా సార్లు తూనికలు, కొలతలకు సంబంధించి వ్యత్యాసాలు చూశాను. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల వ్యాపారులు ఎవరికి ఇష్టమొచ్చినట్లు వారు వ్యవహరించి మోసం చేస్తున్నారు. గతంలో కొలతల రాళ్ల (ఇనుముతో ఉండేటివి) కు కింద భాగంలో సీసం ఉండేది. వాటి స్థానంలో ఎలక్ట్రానిక్ మిషన్లు వచ్చిన తరువాత తూకాల్లో కచ్చితత్వం ఉంటుందని అనుకొన్నారు. వాటిలో కూడా ముందుగా తూకం సరిచేసి సిద్ధం చేసి ఉంచుకొంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వీటిలో ప్రభుత్వ చౌక దుకాణాలలో ఎక్కువగా మోసం చేస్తున్నారు. –కె. జీవానందం, రాయచోటి

యథేచ్ఛగా ఇసుక దోపిడీ

- ప్రభుత్వ నిర్దేశిత ధరల కంటే అదనంగా వసూళ్లు
- టిప్పర్ అసోసియేషన్ పేరుతో కృత్రిమ కొరత
- ఇతర టిప్పర్లు పట్టణంలోకి రాకుండా అడ్డగింత
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, మైనింగ్ అధికారులు



అన్నమయ్యసర్కిల్‌లో నేషనల్ హైవేపై ఇసుక టిప్పర్లు

మదనపల్లె: పట్టణంలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతోంది. ఉచిత ఇసుక విధానంతో సామాన్యుడికి ఇసుక అందుబాటులోకి తెచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమిప్రభుత్వం, క్షేత్రస్థాయిలో జరుగుతున్న దోపిడీని మాత్రం చూసీ చూడనట్లు వదిలేస్తోంది. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే టిప్పర్ యజమానులు వినియోగదారుల నుంచి అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇసుక కృత్రిమ కొరతను సృష్టించి, తాము చెప్పిందే ధర, తాము తోలిందే ఇసుక అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. భవన నిర్మాణ యజమానులు ఎవరైనా నేరుగా రీచ్ నుంచి ఇసుక తోలుకునేందుకు ప్రయత్నిస్తే, వాహనాలను అడ్డుకోవడం, బెదిరింపులకు పాల్పడటం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నేషనల్ హైవేపై అసోసియేషన్ కార్యాలయం ఎదుట 15కు పైగా టిప్పర్లను నిలుపుకుని బహిరంగంగా విక్రయాలు జరుపుతున్నారు. ఇసుక అక్రమరవాణా, బ్లాక్ మార్కెటింగ్ నివారణకు ఏర్పాటుచేసిన విజిలెన్స్ విభాగం, గనులశాఖ, రెవెన్యూ అధికారుల కళ్లెదుటే ఇదంతా జరుగుతున్నప్పటికీ పట్టించుకున్న దాఖలా లేదు.

- ప్రభుత్వ పోర్టల్‌లో కానీ లేదా స్థానిక గ్రామ,వార్డు సచివాలయాల్లో వెళ్లి భవన నిర్మాణ అనుమతులు చూపించి ఇసుకను పొందే వీలును ప్రభుత్వం కల్పించింది. ఇందుకు వినియోగదారుడు ఇసుక లోడింగ్ చేసేందుకు, రీచ్ నుంచి ఇంటి వరకు రవాణా చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. దీనికి సంబంధించి ఆయా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో రవాణా చార్జీలను ఖరారుచేసి, సరఫరాలో ఎలాంటి అవినీతి జరగకుండా విజిలెన్స్ మానిటరింగ్, మైనింగ్ చెక్‌పోస్టులు, పోలీస్ తనిఖీలు చేయాలని ఆదేశించింది. అయితే క్షేత్రస్థాయిలో ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. అన్నమయ్యజిల్లా రాజంపేట మండలం బాలరాజుపల్లె వద్ద ఇసుకరీచ్ ఉంది. మదనపల్లె నుంచి ఇసుకరీచ్‌కు 132 కిలోమీటర్ల దూరం ఉంటుంది. పట్టణంలో భవన నిర్మాణపనులు అధికంగా జరుగుతుండటం, డిమాండ్ ఉండటంతో కొద్దిరోజుల క్రితం వరకు రాయచోటి, పీలేరు, వాల్మీకిపురం, మదనపల్లెకు చెందిన టిప్పర్ యజమానులు రూ.18వేలకు టిప్పర్ ఇసుక తోలేవారు. ప్రజల నుంచి ఈ ధరలపై ఎక్కడా వ్యతిరేకత వ్యక్తం కాలేదు. అయితే..ఈనెల 2న బైపాస్‌రోడ్డులో మదనపల్లె టిప్పర్ ఓనర్స్ అసోసియేషన్ పేరుతో ఓ కార్యాలయాన్ని ఏర్పాటుచేసి, సీఎం, డిప్యూటీ సీఎం ఫోటోలు పెట్టి... టీడీపీ తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబుతో ప్రారంభించారు. అధికారపార్టీ అండతో ఇసుక రవాణాను తమ చేతుల్లోకి తీసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ, అధికారికంగా బిల్లులు ఉన్న ఇతర ప్రాంతాల ఇసుక టిప్పర్లను పట్టణంలోకి రానివ్వకుండా అడ్డుకోవడం మొదలుపెట్టారు. ఇసుక కృత్రిమ కొరత సృష్టించి, ఎవరికైనా ఇసుక కావాల్సి వస్తే తమనే సంప్రదించాలని, టిప్పర్ ఇసుకకు 22 నుంచి 24 వేల ధర నిర్ణయించి, తమవద్దే కొనుగోలుచేయాల్సిందిగా హుకుం జారీచేశారు. దీంతో ఇసుక అవసరమైన వారు వారు చెప్పిన ధరలు చెల్లించి, కిమ్మనకుండా తోలుకుంటున్నారు.

వాస్తవానికి ఇసుక రీచ్ నుంచి బయలుదేరిన టిప్పర్ నేరుగా వినియోగదారుడికి డెలివరీ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే.. తప్పుడు బిల్లులతో తీసుకువచ్చిన సుమారు 15 లారీలకు పైగా ఇసుక నింపుకున్న టిప్పర్‌లు అసోసియేషన్ కార్యాలయం ఎదుట నేషనల్ హైవేపై నిలుపుకుని బహిరంగ విక్రయాలు చేస్తున్నారు. ఈ విషయమై టిప్పర్ అసోసియేషన్ నాయకులను వివరణ కోరితే... టిప్పర్ యజమానులు నష్టపోకూడదనే తాము అసోసియేషన్ ఏర్పాటుచేసుకున్నామని, ప్రభుత్వం 18,400 ధర నిర్ణయించిందని, తాము 3వేలు మాత్రమే అదనంగా వసూలు చేస్తున్నామన్నారు. ఇతర ప్రాంతాల టిప్పర్‌లు వస్తే అసోసియేషన్ మెయింటెన్స్‌కు డబ్బులు కట్టించుకుని వదులుతున్నామన్నారు.

దోపిడీని అరికట్టాలి...

ఇసుక రవాణాకు సంబంధించి ప్రధాన రహదారుల్లో మైనింగ్, విజిలెన్స్, పోలీసు అధికారుల తనిఖీలు, చెక్‌పోస్ట్ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా దోపిడీ జరుగుతోంది. తక్కువ ధరకు ఇసుక తోలేందుకు వస్తున్న టిప్పర్ యజమానులను, టిప్పర్ అసోసియేషన్ సభ్యులు బెదిరించడం తగదు. పోలీస్, మైనింగ్ అధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని, ఇసుక మాఫియాపై కఠినచర్యలు తీసుకోవాలి. – సాంబశివ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

వైభవంగా రామయ్య పౌర్ణమి కల్యాణం

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో శుక్రవారం సీతారాముల పౌర్ణమి కల్యాణం వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, పూలమాలలతో అలంకరించారు. అర్చకులు వీణా రాఘవాచార్యులు, వీణా మనోజ్ కుమార్‌లు కల్యాణ క్రతువును నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.



మంగళ సూత్రాన్ని చూపుతున్న అర్చకులు

క్లుప్తంగా

కువైట్‌లో కొండావాండ్లపల్లె మహిళ మృతి



మృతురాలు లక్ష్మీదేవి(ఫైల్)

సంబేపల్లి : మండలంలోని నారాయణరెడ్డిపల్లె పంచాయతీ కొండావాండ్లపల్లెకు చెందిన చంద్రగిరి లక్ష్మీదేవి(36) కువైట్‌లో మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. ఏడాది కిందట బతుకుదెరువుకోసం లక్ష్మీదేవి కువైట్‌కు వెళ్లారు. భర్త శ్రీనివాసులు ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం తెల్లవారుజామున కువైట్ లక్ష్మీదేవి చనిపోయిందని మృతురాలి బంధువులకు కువైట్ నుంచి సమాచారం అందినట్లు తెలిపారు. ఈ వార్త వినగానే గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గురువారం లక్ష్మీదేవి తన కుమార్తె హారతి, కుమారుడు చెన్న కేశవ, కుటుంబ సభ్యులతో మాట్లాడిందని బంధువులు తెలిపారు. ఒక్క రోజులోనే తల్లి మృతి వార్త విన్న పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కడసారైన తమ తల్లిని చూపాలని ప్రభుత్వ పెద్దలను వేడుకుంటున్నారు.

మిద్దెపై నుంచి పడి గాయాలు

మదనపల్లె : మిద్దెపై నుంచి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం ఉదయం పట్టణంలో జరిగింది. నక్కలదిన్నెకు చెందిన వెంకటరమణ(62) మిద్దెపై ఆరబోసిన మిరప కాయలను కిందకు తెచ్చేందుకు వెళ్లాడు. కిందకి దిగే క్రమంలో ప్రమాదవశాత్తూ కాలు జారి కింద పడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బొలెరో ఢీకొని ఆర్టీసీ డ్రైవర్‌కు..

బొలేరో వాహనం ఢీకొని ఆర్టీసీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మదనపల్లి మండలం చీకలబైలు పంచాయతీ బార్లపల్లెకు చెందిన రామన్న కుమారుడు సుధాకర(50) ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో సుధాకర్‌కు గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తాలూకా పోలీసులు కేసు విచారిస్తున్నారు.

దోస రైతుకు నిరాశ



పొలంలో కోసి ఉంచిన దోసకాయలు

లక్ష రూపాయలు భూమిలో పోసిన రైతుకు ఏటా నిరాశే మిగులుతోంది. వేసవి కావడంతో దోస పంటకు మంచి డిమాండ్ ఉంటుందని కష్టపడి పండించిన అన్నదాతలు దళారుల మాయకు దిగాలు పడుతున్నారు. ఉన్నపాటుగా ధర భారీగా పతనమవడంతో దిక్కుతోచక ఆందోళన చెందుతున్నారు.

- దళారుల సిండికేట్‌తో ధర తగ్గింపు
- టన్నుకు ఏడు వేల రూపాయల నష్టం
- ఈ ఏడాది మోసపోయిన రైతులు

ఓబులవారిపల్లె : వాణిజ్య పంటలకు పేరుగాంచిన రైల్వేకోడూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఏటా 650 ఎకరాల్లో దోస పంట సాగు చేస్తారు. అప్పు తెచ్చి దుక్కులు చేసి పంట సాగు చేసిన రైతుకు తీరా దిగుబడి చేతికందే సమయంలో దళారుల చేతుల్లో నష్టపోతున్నారు. ఎగుమతి చేసే దళారులు మాత్రం కోట్లకు పడగలెత్తుతున్నారు. ఈ ఏడాది పంట పండించిన రైతు కంటే దళారులే ధర నిర్ణయించడం పరిపాటిగా మారింది. రంజాన్ మాసం ముందుగానే రావడంతో దోస పంట చేతికందింది. ఈ సమయంలో మంచి ధర పలుకుతుందని రైతులు ఎంతో ఆశపడ్డారు.

ధర పతనం

దోస కాయల ధర మార్కెట్‌లో టన్నుకు రూ. 22 వేలు పలుకుతోంది. అయితే హోలీ పండగ అడ్డుపెట్టుకొని కొందరు దళారులు సిండికేట్‌గా మారి ఒకేసారి టన్నుపై రూ.7 వేలు తగ్గించేశారు. కోహినూర్ రకం దోస టన్ను రూ.54 వేలు ఉండగా, రూ.30 వేలకు పడిపోయింది. రైతు చేసేదేమీలేక.. చేతికందిన పంట వదిలేయలేక దళారులు చెప్పిన కాటికే అమ్మి తీవ్రంగా నష్టపోతున్నారు. దోస పంట సాగుచేసినప్పటి నుంచి విత్తనం, ఎరువులు, కూలీలు, మందులు, మల్చింగ్ ఖర్చులు ఒక ఎత్తయితే.. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని పంట దిగుబడులు తీశాడు. ఎకరాకు లక్ష రూపాయల నుంచి రూ.1.20 లక్షలు ఖర్చు చేశారు. ఇపుడు చేతికందే సమయంలో ధరలేక దళారుల చేతుల్లో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇదే విధంగా కొనసాగితే భవిష్యత్తులో వ్యవసాయమే ప్రశ్నార్థకంగా మారే అవకాశం లేకపోలేదు. ఒకటేసారి టన్నుకు ఏడువేల రూపాయలు నుంచి తొమ్మిదివేల రూపాయల వరకు రైతు నష్టపోతున్నాడు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని దోస రైతులు కోరుతున్నారు.

వారం లోపు రూ.7 వేలు తగ్గింపు



దళారులు అందరూ సిండికేట్‌గా ఏర్పడి హోలీ పండగ పేరుతో దోస దిగుబడులు టన్నుకు రూ.7 వేలు తగ్గించారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి పంట సాగు చేస్తే రైతులను మోసం చేసి దోచుకుంటున్నారు. దళారులపై చర్యలు తీసుకోవాలి.

– బండారు వెంకటరమణ, రైతు, చెన్నరాజుపోడు, ఓబులవారిపల్లి మండలం

దళారులు కోట్లు సంపాదిస్తున్నారు



పంట చేతికేందే సమయంలో గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టపోయాను. ఏటా దళారుల చేతుల్లో మోసపోవాల్సి వస్తోంది. వారు నిర్ణయించిన సిండికేట్ ధరతో మేము పంట అమ్మాల్సి వస్తోంది. అధికారులు చర్యలు తీసుకొని రైతును కాపాడకపోతే భవిష్యత్తులో వ్యవసాయం చేయలేం.

– నందలూరు వెంకటసుబ్బారెడ్డి, ఓబులవారిపల్లి

విషద్రావణం తాగి విద్యార్థిని ఆత్మహత్య



మృతి చెందిన అక్షయ

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని నాగులకట్ట వీధిలోని ఎస్సీ హస్టల్‌లో ఉంటున్న అక్షయ(19) శుక్రవారం విష ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. పెద్దముడియం మండలం కొండసుంకేసుల గ్రామానికి చెందిన అక్షయ పట్టణంలోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూ ఎస్సీ హాస్టల్‌లో ఉంటోంది. గురువారం రాత్రి వసతి గృహంలో వి ద్యార్థినుల మధ్య మనస్పర్థలు చోటుచేసుకోవడం, కాసేపటి తరువాత విద్యార్థి నులు క్షమాపణలు చెప్పుకోవడం జరిగినట్లు తెలిసింది. అయితే శుక్రవారం మ ధ్యాహ్నం అందరూ భోజనం చేయడానికి వెళ్లగా అక్షయ మాత్రం వెళ్లలేదు. అప్ప టికే తెచ్చుకున్న విష ద్రావణాన్ని(వాస్మోల్) తాగింది. విషయం తెలుసుకున్న వార్డెన్ బత్తుల ప్రభావతి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూ చన మేరకు పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 8.45 గంటల మధ్యలో చనిపోయినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు.

ప్రజా సంఘాల ఆగ్రహం

అక్షయ అత్మహత్యపై ప్రజాసంఘాల నాయకులు అగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు వసతిగృహనికి చేరుకోని విద్యార్థిని మృతికి హాస్టల్ వార్డన్ బత్తుల ప్రభావతి, సిబ్బంది కారణం అని హస్టల్స్ ఏఎస్‌డబ్ల్యూ గురుప్రసాద్, సీఐ లింగప్పకు ఫిర్యాదు చేశారు. గత ఏడాది నవంబరు 7న కూడా వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినులు వాస్మాల్ తాగి అత్మహత్య యత్నానికి పాల్పడ్డారని వారు ఆరోపించారు. ఇంత జరుగతున్నా అధికారులు చర్యలు చేపట్టలేదన్నారు. సీఐ ఎస్.లింగప్ప వసతి గృహానికి వెళ్లి విద్యార్థినులను విచారించారు. దర్యాప్తు అనంతరం అక్షయ ఆత్మహత్యయత్నానికి కారణాలు తెలియజేస్తామని సీఐ తెలిపారు.

పశువైద్య విద్యార్థులకు న్యాయం చేయండి

మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి పీడీఎస్‌యూ నేతల వినతి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

రాయచోటి అర్బన్ : ఎంబీబీఎస్ విద్యార్థులతో సమానంగా పశువైద్య విద్యార్థులకు గౌరవ వేతనం చెల్లించే విధంగా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని పీడీఎస్‌యూ నాయకులు అంకన్న డిమాండ్ చేశారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిని శుక్రవారం వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంకన్న మాట్లాడుతూ 2013 వరకూ రాష్ట్రంలో పశు వైద్య విద్యార్థులకు రూ.5 వేల గౌరవవేతనం అందించామన్నారు. ప్రస్తుతం ఎంబీబీఎస్, బీడీఎస్ విద్యార్థులకు రూ.25వేల గౌరవ వేతనం అందిస్తున్నారని, పశు వైద్య విద్యార్థులపై మాత్రం వివక్ష చూపుతున్నారన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి పశు వైద్య విద్యార్థులకు రూ.25వేల గౌరవ వేతనం అందించాని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా నేతలు రవీంద్ర, మహేష్, చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా ఉంటాం

ఉద్యోగులకు అన్ని రకాలుగా అండగా ఉంటానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల ఎన్నికైన ఏపీ ఎన్‌జీఓ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం మంత్రిని ఆయన స్వగృహంలో కలిసి సమస్యలను విన్నవించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేలా చూస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన లబ్ధిదారులకందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.ప్రసాద్‌యాదవ్, కడప జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీ నరసింహారెడ్డి, శ్రీనివాసన్, పద్మనాభం, బలరామరాజు, వెంకటేశ్వరరెడ్డి, ఆర్.జయచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అమెరికాకు ఒంటిమిట్ట రామయ్య తలంబ్రాలు



అమెరికాకు తీసుకువెళ్లనున్న రామయ్య తలంబ్రాలు, పట్టు వస్త్రాలు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట కోదండరామాలయం నుంచి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను అమెరికాకు పంపనున్నారు. సాలాబాద్‌కు చెందిన మల్లారెడ్డి కుమారుడు వెంకటసుబ్బారెడ్డి శుక్రవారం కోదండరాముడికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. పూజలు పూర్తయిన అనంతరం వాటిని అమెరికా దేశంలోని చికాగోలోని లెమోంట్ రామాలయంలో జరగబోయే శ్రీరామనవమి వేడుకల్లో రఘునందుడికి సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముమ్మడి మల్లారెడ్డి, లలితమ్మ, భానుశ్రీ, తన్వీ, ఈక్షిత, సుదర్శన్‌రెడ్డి, వాసవీ, జశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వెంకట శివసాయి ఆలయం గొప్పది



విగ్రహాలను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంబేపల్లె : మోటకట్ల వెంకటశివసాయి ఆలయం ఎంతో పేరుగాంచిన గొప్ప ఆలయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే అకేపాటి అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆలయాన్ని శుక్రవారం వారు సందర్శించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన ఆలయం నిర్మించి, విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటనాథరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి వీవీ.రమణారెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బానుమెర్తి, ఉదయ్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, మురళీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లూరమ్మ తిరుణాల





ఊరేగింపుగా వస్తున్న చాందినీ బండి, అమ్మవారి దర్శనానికి బారులు

చిన్నమండెం : చిన్నమండెం మండలం మల్లూరు కొత్తపల్లె సరిహద్దున వెలసిన మల్లూరమ్మ జాతర శుక్రవారం వైభవంగా ముగిసింది. అమ్మవారి మూలవిరాట్‌ను పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు చాందినీబండ్లతో వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. రాయచోటి డీఎస్పీ కొండయ్యనాయుడు, రూరల్ సీఐ వరప్రసాద్ బందోబస్తు చర్యలు చేపట్టారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా 250 మంది పోలీసులు పర్యవేక్షించారు. పలు ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

భార్యా, పిల్లలను నిర్బంధించారని ఫిర్యాదు

కడప అర్బన్ : తన భార్య, పిల్లలను బాకీ డబ్బుల కోసం నిర్బంధించారని రాంబాబు అనే వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు. వేంపల్లికి చెందిన రాంబాబు కడప జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్‌ను కలిసేందుకు వచ్చారు. ఎస్పీ అందుబాటులో లేకపోవడంతో విలేకరులతో రాంబాబు మాట్లాడుతూ ఓ వ్యక్తి నుంచి తన భార్య గంగాదేవి రూ.45లక్షలు రూ.2కు వడ్డీకి తెచ్చి కార్పొరేషన్ ద్వారా వడ్డీలకు ఇచ్చిందన్నారు. ఆ డబ్బు చెల్లించలేదంటూ వారు తన భార్య, పిల్లలను తీసుకెళ్లి నిర్బంధించారన్నారు.

ఒప్పంద కార్మికులను తొలగించవద్దు



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

రాజంపేట రూరల్ : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పని చేసే ఒప్పంద కార్మికుల అక్రమ తొలగింపును నిలిపివేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గంగాధర్, సీపీఐ జాయింట్ సెక్రటరీ పి.మహేష్, భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి చంద్ర, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఇ.సికిందర్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 15వేలకు పైగా ఒప్పంద కార్మికులు పనిచేస్తున్నారని గుర్తుచేశారు. అధిక శాతం కార్మికులు స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులే అన్నారు. వారిలో ఇప్పటికే 900 మంది కార్మికులను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి మూడు నెలలకోసారి 1400 మంది చొప్పున మొత్తం 5600 మందిని తొలగించే కుటిల ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగే కొనసాగితే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఒక పక్క రక్షిస్తామని చెబుతూనే మరోక వైపు ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

బాల భటులు ప్రపంచస్థాయి పౌరులుగా ఎదగాలి



శిక్షణ పొందిన విద్యార్థులతో స్కౌట్‌మాస్టర్‌లు, గైడ్ కెప్టెన్లు

రాయచోటి అర్బన్ : బాలభటులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని ప్రపంచ స్థాయి పౌరులుగా ఎదగాలని స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి కోరారు. రాయచోటి పట్టణంలోని అర్చన కళాశాలలో ఈ నెల 10వ తేదీ నుంచి నిర్వహిస్తున్న పెట్రోల్ లీడర్స్ శిక్షణ ముగింపు సమావేశం శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంపికైన 36 పీఎంశ్రీ పాఠశాలల నుంచి వచ్చిన 272 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలను వివరించారన్నారు. రోడ్డుప్రమాదాలు జరిగి నప్పుడు ప్రథమ చికిత్స అందించి సమీపంలోని ఆసుపత్రికి చేర్చడం, స్వచ్ఛందంగా సేవలందించడం, మంచి అలవాట్లను నేర్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓసీ లక్ష్మికర్, హెచ్‌డబ్ల్యూఓ నిర్మల, ఓబులరెడ్డి, నాగరాజు, సుజాత, గోవిందమ్మ, స్వర్ణలత పాల్గొన్నారు.

23న రాయలసీమ మాలల సింహగర్జన



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న మాలల జేఏసీ నాయకులు

రాజంపేట రూరల్ : తిరుపతిలో ఈ నెల 23న ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌ను వ్యతిరేకిస్తూ రాయలసీమ మాలల సింహగర్జన నిర్వహిస్తున్నట్లు రాయలసీమ మాలల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి విరుద్ధంగా ప్రధాని మోదీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసిందన్నారు. మాలలు అంతా ఏకమై సింహగర్జనలో దీనిని వ్యతిరేకించాలన్నారు. ఈ సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పూతలపట్టు ప్రభాకర్, లింగం సంజీవ్, ధన శేఖర్, పూలమరెడ్డి మల్లికార్జున, జట్టి చిరంజీవి, జనార్ధన, చౌడవరం సుబ్బనరసయ్య, సిగి చిన్నయ్య, ఈబిలి పెంచలయ్య, సుబ్బయ్య, దండప్రసాద్, కాంతయ్య, కే.హరినాథ్, రవిశంకర్, రైటర్ పుండ్రిక, కె.సుధాకర్, ఒ.పెంచలయ్య, కన్నయ్య, శ్రీను, మనోహర్, ఈశ్వరయ్య, కె.హరి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో మైక్ సెట్ చోరీ

మదనపల్లె : ఆలయంలో మైక్ సెట్ చోరీకి గురైన సంఘటన గురువారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. అంకిశెట్టిపల్లె పంచాయతీ గాంధీపురంలోని కోదండరామస్వామి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆలయానికి అమర్చిన మైక్ సెట్‌ను ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం గమనించిన స్థానికులు చోరీ ఘటనపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మైక్ సెట్ విలువ సుమారు రూ.11వేలు ఉంటుందని పేర్కొన్నారు. తాలూకా సీఐ కళావెంకటరమణ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు.

గిరిజన మహిళపై దాడి



తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్న బాధిత గిరిజన మహిళ

మదనపల్లె : భూ వివాదంలో కొందరు వ్యక్తులు తనపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని గిరిజన మహిళ సునీత ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్‌కు వెళితే న్యాయం చేయకపోగా, తనపైనే కేసు బనాయించారని ఆరోపించారు. ఆమె వివరాల మేరకు.. పట్టణంలోని చంద్రా కాలనీకి చెందిన కృష్ణా నాయక్, సునీత దంపతులు దినసరి కూలీలు. వారికి స్థానికుడు బాల్ రెడ్డితో స్థల వివాదం ఉంది. అదే స్థలంలో తాము నిర్మించుకున్న పునాదులను గురువారం సాయంత్రం కొందరు తొలగిస్తున్నారని చెప్పడంతో అక్కడకు వెళ్లినట్లు సునీత తెలిపారు. ఆ సమయంలో బాల్‌రెడ్డి, కుటుంబ సభ్యులు తనపై కర్రలు, రాళ్లతో విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచారన్నారు. అపస్మారకస్థితిలో పడిన తనను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లి తన చెల్లెలు చికిత్స అందించిందన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లినా, పోలీసులు ఫిర్యాదు తీసుకోకుండా, బాల్‌రెడ్డి ఫిర్యాదుమేరకు తనపై కేసు నమోదుచేశారని ఆరోపించారు. తనకు న్యాయం జరగకపోతే, సీఎం, హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లి సాయం కోరతానని తెలిపారు


టిప్పర్ డ్రైవర్‌పై దాడి



సీఐ రామచంద్రకు ఫిర్యాదుచేస్తున్న టిప్పర్ డ్రైవర్ సుబ్రహ్మణ్యం

మదనపల్లె : రాయచోటి నుంచి మదనపల్లెకు ఇసుక తీసుకుని వచ్చినందుకు టిప్పర్ డ్రైవర్‌పై మదనపల్లె టిప్పర్ అసోసియేషన్ సభ్యులు దాడి చేసిన ఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. రాయచోటికి చెందిన సుబ్రహ్మణ్యం టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం రాజంపేట రీచ్ నుంచి ఇసుక లోడ్ చేసుకుని, మదనపల్లెలో అన్‌లోడ్ చేసి తిరిగి రాయచోటికి వెళుతున్నాడు. చౌడేశ్వరి సర్కిల్ వద్ద అసోసియేషన్ సభ్యులు బిల్డప్ భరత్, పీఎస్ఆర్.ప్రసాద్‌రెడ్డి, అంకిశెట్టిపల్లె రమేష్, మణి, గొల్లపల్లెశివ, ముబారక్‌బాషా, ఏఎన్ఎస్ అమర తదితరులు బండిని అడ్డుకుని తాళాలు లాక్కోవడమే గాక, తనపై దాడిచేసి, చొక్కాను చించివేసి గాయపరిచారన్నారు. మదనపల్లెలో టిప్పర్ అసోసియేషన్ లారీలు తప్ప వేరెవ్వరూ తక్కువ ధరకు ఇసుక అమ్మరాదని, తాము రూ.24 వేలు అమ్ముతుంటే, నీవు రూ.18,500కు ఎలా దించుతావంటూ గదమాయిస్తూ విచక్షణారహితంగా కొట్టారన్నాడు. బాధితుడు టిప్పర్‌ను అక్కడే విడిచిపెట్టి, తెలిసిన వారి సహాయంతో టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని, సీఐ రామచంద్రకు ఫిర్యాదు చేశాడు. దాడి ఘటనపై విచారణ చేసి కేసు నమోదుచేస్తామని తెలిపారు.

బొలెరో వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన నాగరాజు

గుర్రంకొండ : బొలెరో వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని తరిగొండ వద్ద జరిగింది. మదనపల్లె రూరల్ మండలం సీటీఎంకు చెందిన సుబ్బమ్మగారి నాగరాజు(45) శుక్రవారం మండలంలోని తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చాడు. స్వామిని దర్శించుకుని తిరిగి ఆటోలో స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో వాల్మీకిపురం వైపు వెళుతున్న బొలెరో వాహనం ఢీకొంది. వెనుక కూర్చున్న నాగరాజుకు తీవ్రరక్తగాయాలయ్యాయి. తిరుపతికి స్విమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా నాగరాజు మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు.

ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

మైదుకూరు : లారీ దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడిన భార్య, భర్తలు తిరిగిరాని లోకాలకు చేరారు. వారి కుమారుడు గాయాలతో చికిత్స పొందుతున్నాడు. చాపాడు మండలం తప్పెట ఓబాయపల్లెకు చెందిన పసుపులేటి చలమయ్య పట్టణంలోని నంద్యాల రోడ్డు సీతారామాంజనేయనగర్‌లో నివాసముంటున్నారు. వీరికి మల్లేష్, వినోద్ కుమార్ కుమారులు. చలమయ్య కేశలింగాయపల్లె వద్ద ఉన్న పొలాన్ని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వినోద్ వ్యవసాయంలో తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు. శుక్రవారం భార్య, కుమారుడు వినోద్‌తో కలిసి చలమయ్య పొలానికి వెళ్లారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్లాలనిమైదుకూరు–పోరుమామిళ్ల రహదారిపైకి చేరుకొని ముగ్గురు ఆటో కోసం ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో మాచర్ల నుండి సిమెంట్ లోడుతో వస్తున్న లారీ వీరిపైకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో చలమయ్య (55), ఆయన భార్య లక్ష్మీదేవి (50) అక్కడికక్కడే మృతి చెందారు. వినోద్ కుమార్‌కు గాయాలవడంతో కడప రిమ్స్‌కు తరలించారు. అర్బన్ సీఐ హాసం పరిశీలించారు. వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.